
# టానిక్

- వి. ఐశ్వర్య

'అమ్మా హోంవర్క్ అయిపోయింది. రేపు సెలవేనమ్మా... కాసేపు ఆడుకోవచ్చా?' బాల్కనీలోంచి క్రింద ఆడుకుంటున్న పిల్లలను ఆశగా చూస్తూ తల్లిని ఎంతో మొహమాటంగా అడిగారు బబ్లూ, బబిత. వసుంధరకు కడుపులో దేవినట్టయింది మానసికంగా అలసిపోయిన వాళ్ల ముఖాలు చూసి. 'అమ్మా నీకిష్టమయితేనే...' అంటున్న కొడుకును, కూతురును చూసి వసుంధర మనస్సు చివుక్కుమంది. ఆడుకోమన్నట్టు మౌనంగా తలూపింది. పిల్లలిద్దరూ కట్టలు తెంచుకున్న ఉత్సాహంతో పరిగెత్తారు. ఆమెలో ఆత్మపరిశీలన మొదలైంది.



'మనిషికి గుర్తింపు రావాలంటే ఈలోకంలో తిరుగు లేనివి రెండే. సహజమైన తెలివితేటలు. అంతులేని కృషితో ఎక్స్‌ట్రా ఆర్డినరీగా ఎదగడం. రెండోది పరపతి. రెండోదానితో వచ్చేది అశాశ్వతం. కాబట్టి చదువు ఒక గొప్ప తపస్సు లాంటిది. ఎప్పుడో ఫలిస్తుంది. అది ఫలించాలంటే కఠోరత తప్పదు వసూ! కారణాలేవైతేనేం మనిద్దరం పై చదువులు చదవలేక ఎదుగూ, బొదుగూ లేని చిన్న ఉద్యోగాల్లో సెటిలయ్యాం. మన పిల్లల భవిష్యత్తయినా ఉజ్జ్వలంగా ఉండాలి మరి' అంటారు భర్త రాఘవ.


అందుకని చిన్నపిల్లలే గదా... ఎదురు తిరగలేరు కదాని భర్త, తను, చదువు, క్రమశిక్షణల పేరుతో పిల్లల్లోని ఆత్మని చంపేస్తున్నారా? వాళ్ల బాల్యాన్ని దోచుకుంటున్నారా? మార్కులతో మేధను కొలుస్తున్నారా... వాళ్లని అవమానిస్తున్నారా?

అలాగని జాలిపడి వదిలేస్తే వాళ్లు చదువురాని మూర్ఖులుగా మిగిలిపోతే? లేదా ఈ పోటీ ప్రపంచంలో తక్కువ మార్కులతో సాటి విద్యార్థులతో తూగలేక మొక్కుబడి ఉద్యోగావకాశాలు లేక, రాక... తర్వాత ఆలోచించడానికి భయం వేసింది వసుంధరకు.

పిల్లల్ని ఎటు తీసికెళ్తున్నాం? మార్కుల పోటీ ఏమిటి? ఎందు కొస్తోంది?

99.99%...99.98%...99.97...99.96%... పిల్లలవి మెదళ్లా కంప్యూటర్లా?

బబ్లూ, బబిత చదివే స్కూలులో కూడా ఒక రకమైన పోటీ పెరిగింది. కారణం తల్లిదండ్రుల్లో చైతన్యమా? పిల్లలకే కలిగిన ఆసక్తా? కోర్సుల పట్ల పెరిగిన అవగాహనా? మామూలు చదువులకి దొరకని ఉద్యోగమా? బబ్లూ... వాడు మరీ నలిగిపోతున్నాడు.



ఒక వైపు స్కూలు మరో వైపు ఆడుకునే సమయం దొరకనందుకు ఆవేదన. ఏదో అస్తిమితం... బాధను వ్యక్తం చేయలేని మొహమాటం. అమ్మ మనసు, నాన్న హృదయం కష్టపడతాయేమోననే మెతకతనం. ఒకోసారి హోం వర్కు చేసుకుంటూనే కింద ఆడే పిల్లల్ని చూస్తూ మైమరపుగా అలాగే ఉండిపోతూంటాడు కొంత సేపు. అంతలోనే చెయ్యాల్సిన హోం వర్కు గుర్తొచ్చి నిరాశగా తల విదిల్చి మళ్లీ తల వంచుకుని చేసుకుపోతుంటాడు.

లక్ష్యసాధన కోసం ఎన్నో త్యాగాలూ అవసరమే. అందుకేగా ఎప్పుడైనా ఒకోసారి 'అయ్యో జీవితాన్ని వృథా చేసుకుంటున్నామా అన్ని సుఖాలూ వదిలేసి' అనిపించినా, పిల్లలిద్దరూ మంచి చదువులు చదవాలంటే పునాది వేసేటప్పుడు ఈ కష్టం తప్పదు అని వాళ్లని మంచి స్కూలులో చేర్పినందుకు, తమ నిత్యావసరాలు, చిన్న చిన్న కోరికలు కొన్నింటిని త్యాగం చెయ్యక తప్పలేదు.

అందుకే అప్పుడు తమ యింట్లో సోఫా సెట్లు లేవు. ఇల్లు చిన్నది కనుక టీవీ లేదు, పిల్లల చదువుకి ఆటంకం అని. ఫ్రిజ్ లేదు చల్లని పదార్థాలు తిని పిల్లల ఆరోగ్యం చెడిపోతుందని... ఆటలు లేవు... సమయం వృథా అవుతుందని...

చిన్న తరగతుల్లోనే పిల్లలకు పేపర్ చదవడం అలవాటు చేశాడు భర్త రాఘవ. పేపర్లో స్ఫూర్తిదాయకమైన వ్యాసాలు, జీవితవిశేషాలు వాళ్లకి వివరిస్తుంటాడు. అందులో ఆక్సిడెంట్‌లో అరిచేతులు, కాళ్లు నుజ్జయినా, మెదడుకు మరింత పదును పెట్టి స్టేట్ ఫస్టు తెచ్చుకున్న ర్యాంకర్లు, కటికపేదరికంలో పుట్టి తినడానికి తిండి, కట్టుకోడానికి బట్టా, పుస్తకాలూ లేకపోయినా లైబ్రరీల సాయంతో మాస్టార్ల సహకారంతో ర్యాంకు సాధించినవాళ్లు, అవార్డులు పొందినవాళ్లు, తాము కోరుకున్న కోర్సును సాధించడానికి వాళ్లెలాంటి కఠోరదినచర్య అవలంబించారో, ఎన్ని అవస్థలు పడ్డారో, రోజు కెన్ని గంటలు కష్టపడ్డారో చదివి వినిపిస్తూంటే, బబ్లూ, బబితల కళ్లు ఆనందంతో ఆశ్చర్యంతో మెరుస్తుంటాయి.

కింద ఏదో గోలగోలగా వినిపించింది, ఆలోచనల్లో మునిగిపోయిన వసుంధరకు.

పరిగెత్తుకొచ్చిన బబ్లూ, బబిత దుఃఖంతో వణికిపోతూ చెప్పారు. 'అమ్మా! శ్వేతక్క ఉరి వేసుకుని చచ్చిపోయిందట. రామ్మా. చూద్దాం.'

వసుంధర చప్పున వాళ్లిద్దర్నీ గుండెల్లో పొదువుకుంది.

**000**

శ్వేత మరణం, చాలా రోజుల పాటు వసుంధర ఉంటున్న కాంప్లెక్స్ వాళ్లందర్నీ ఓ కుదుపు కుదిపింది. చక్కని రూపం, నల్లని ఒత్తయిన జుట్టు. ఒదికైన శరీరం. కాశ్మీరీ పిల్లలా ఎర్రగా ఉండేది శ్వేత. దానిమ్మ గింజల్లాంటి పలువరుస, పెద్ద ఆకర్షణ ఆ అమ్మాయిలో. నవ్వితే గలగలా గోదారే.

జీవితంలో పావు భాగమైనా పూర్తి కాలేదు ఆ అమ్మాయికి... అదృష్టంలాగే మృత్యువు కూడా ఎప్పుడు ఎవరిని కోరుకుంటుందో ఎవరికి ఎరుక? కానీ అకాలమృత్యువయితేనే రంపపు కోత. చక్కగా చదువుకుంటున్న పిల్లలు పరీక్షల ముందో, తర్వాతో ఆక్సిడెంటుల్లో పోవడంతో గుండెలు పగిలేలా రోదించే బంధువులు 'వాడికలా రాసి పెట్టుంది' అని సరిపెట్టుకోవడం ఒక ఎత్తయితే... శ్వేతను కేవలం 'చదువే' మృత్యువుగా కబళించడం మరో ఎత్తు.

శ్వేత గుర్తొచ్చిన కొద్దీ వసుంధర డీలా పడిపోయింది.

'నేను డాక్టర్ని అవుతాను ఆంటీ! అదే నా తపస్సు. మా అమ్మమ్మ కాన్సర్‌తో చిన్నప్పుడు పోవడం వల్ల మా అమ్మకి తల్లి ప్రేమ దొరకలేదని ఎప్పుడూ బాధపడుతూ ఉంటుంది. నేను కాన్సర్‌కి తప్పక మందు కనిపెడతా. క్యాన్సర్ రోగులకి ఉచితంగా వైద్యం చేస్తా' అనేది.

ర్యాంకు కోసం నిద్రాహారాలు మాని రాత్రింబగళ్లు కష్టపడి చదివే శ్వేతకి పదిహేడేళ్లు.

అక్కా అంటూ ఆ పిల్లని వదిలేవాళ్లు కాదు పిల్లలు. శ్వేత కుటుంబం నాలుగేళ్ల క్రితం ఆ కాంప్లెక్స్‌లోకి వచ్చింది. తండ్రి వ్యాపారి. తల్లి సాధారణగృహిణి. శ్వేత తమ్ముడు డెహరాడూన్‌లో రెసిడెన్షియల్‌లో చదువుకునేవాడు. చదువంటే ఎంత మమకారం వున్నా కాంప్లెక్స్‌లో జరిగే పిల్లల బర్త్ డే ఫంక్షన్లకి శ్వేతే చీఫ్ గెస్ట్. ఆ పుట్టినరోజు పాపాయిల్ని అందంగా అలంకరించడం, హాలు డెకరేషన్, కేక్ కట్ చేయించడం, పిల్లలకి స్వీట్స్ పంచడం, చివరకు రిటర్న్ గిఫ్టులు ఇవ్వడం వరకూ శ్వేత ఉండాల్సిందే. చివరకు పిల్లల డ్రెస్ సెలక్షన్ కూడా శ్వేతదే.

హై స్కూలు చదువులో కూడా శ్వేత ర్యాంకు సాధించింది. అప్పట్నుంచీ మరీ పట్టుదలగా చదివేది. అలాంటి పిల్ల... ర్యాంకు రాలేదని చున్నీతో ఫాన్‌కి ఉరి వేసుకుంది.

అంత కన్నా విషాదం ఏమిటంటే... తర్వాత తెలిసింది ఆపిల్లకి ర్యాంకు వచ్చిందనీ, రిజల్టు తారుమారైందనీను. ఆ పిల్ల చనిపోయిన రోజు కంటే ర్యాంకు తారుమారైందని తెలిసిన రోజున విద్యావ్యవస్థ మీదే అసహ్యం వేసింది వసుంధరకి.

శ్వేత చావుకి బాధ్యత ఎవరిది? తర్వాత వచ్చినా ర్యాంకు ఆ పిల్ల

**ఆంధ్రప్రభ ఆదివారం అనుబంధం-**
**ఏ.వి.కె.ఎఫ్. (అమెరికా) కలిసి నిర్వహించిన దీపావళి కథల పోటీలో**
**రు. 5000/-ల నగదు బహుమతి పొందిన కథ**

ప్రాణాలను తిరిగి తీసుకురాగలదా? తల్లిదండ్రుల గర్భశోకం తీర్చగలదా?

రాత్రింబగళ్లు అంత పట్టుదలగా బలంగా చదివిన ఇలాంటి లేత మెదళ్లు, ర్యాంకు రానంత మాత్రాన ఎక్కడో జరిగిన పొరపాటుకి ప్రాణం తీసుకునేంత బలహీనంగా ఎలా తయారవుతున్నాయి?

పేపర్లో తన రిజల్టు కనిపించలేదనో, అడపాదడపా మార్కులు తక్కువయ్యాయనో, ర్యాంకు రాలేదనో అవమానభారంతో ప్రాణం తీసుకునే విద్యార్థుల సంగతులు చదివినప్పుడు, ఓ గంట వరకూ మనసు కకావికలు... పిల్లలంత బలహీనులుగా మారకుండా జాగ్రత్తలు చెప్పాలి అనిపిస్తుంది... అయితే ఎలా???

నిత్యం కళ్ల ముందు తిరిగిన సెలయేరు లాంటి అందమైన శ్వేత మూగపోయేసరికి, వసుంధర ఇంట్లో ఎవరూ త్వరగా తేరుకోలేక పోయారు.

నిద్రలో లేచి ఏడ్చేది బబిత. 'మమ్మీ, శ్వేతక్క ఎందుకు చచ్చి పోయింది?' అంటూ రాత్రంతా నిద్రపోయేది కాదు. బబ్లూ పలవరింతలే పలవరింతలు... 'వద్దు శ్వేతక్కా! ఆగు నువ్వు వెళ్లొద్దు' అంటూ.

శ్వేత ఏ జబ్బుపడి చనిపోతేనే ఎలాగో ఉండేది కనీసం. కాని పైకి గలగలా నవ్వుతూ ఎంతో ధైర్యంగా వుండే శ్వేత మనసు, అంత బలహీనమై పోయిందెందుకో?

జీవిత మంటే ఒక్క చదువేనా, కెరీరేనా? అందులోనూ అందమైన ఆడపిల్లల జీవితపరమార్థం ఇదేనా?

పది-పదిహేనేళ్ల క్రితం ఆడపిల్ల ధ్యేయం మంచి వరుడిని పొందడమే అయేది. కాని చాప కింద నీరులా నెమ్మదిగా 'ఆడపిల్లని కూడా మగాడితో సమానంగా చదివించాలి' అనే ఆలోచన క్రమంగా తల్లిదండ్రుల మెదడులో పుట్టింది. పెళ్లి కంటే కెరీర్ ముఖ్యమనేది ఆడపిల్లకూ పుట్టింది. అందుకే అంతకు ముందు లేని రంగాల్లో కూడా ఆడపిల్లలు రాణించడం మొదలుపెట్టారు. ఉపాధిరంగంలో కూడా పెను మార్పులు. కొత్త కొత్త రంగాలు తెర మీదికి వచ్చాయి. ఇప్పుడు ఆడా, మగా పిల్లలకి సమప్రాధాన్యమిచ్చి చదివిస్తున్నారు తల్లి దండ్రులు. ఇంత మంచి తరుణంలో ఒక మంచి భవిష్యత్తున్న శ్వేత ఉరి ద్వారా ప్రాణాలు తీసుకోవడమా?

అదీ కాక ఒక సంవత్సరంలో ఏ కారణం చేతనైనా సాధించలేకపోతే చావే శరణ్యమా? సివిల్స్ లాంటి పరీక్షలకి ఎన్ని సార్లు ప్రయత్నం చేస్తున్నారు? కొందరికి మొదటి ప్రయత్నంలో సాధ్యమైతే మరి కొందరికి మూడో, నాలుగో సారో విజయం లభిస్తోంది.

శ్వేత చనిపోయాక నెల్లాళ్లు దయ్యమైందనే పుకార్లు కూడా వ్యాపించాయి కాంప్లెక్స్‌లో. రాత్రి పూట గలగలా నవ్వులు, వెంటనే వెక్కివెక్కి ఏడ్పులూ వినిపిస్తున్నాయనీ, ఆ పిల్ల కాంప్లెక్స్ అంతా తిరుగుతోందనీ, కోరిక తీరక దయ్యమైందనీ ఒకటే కబుర్లు. అదిగో పులి అంటే ఇదిగో తోకంటున్నారు జనం.

వసుంధర కుటుంబంతో ఎంతో చనువున్న శ్వేత, వాళ్లకెప్పుడూ కనిపించలేదు. వసుంధరకు, శ్వేత తల్లిదండ్రులను చూసి కడుపు తరుక్కుపోయేది.

'శ్వేతకి చదువు బదులు పెళ్లి చేసి వుంటే హాయిగా బ్రతికేదేమో నమ్మా' అంటూ వాళ్ల మామ్మగారు ఒకటే ఏడుపు.

తల్లీ, తండ్రీ అయితే అన్నం నీళ్లూ మానేసి వారం వరకూ గది బయటకే రాలేదు.

మనసులో ఎవరేం అనుకున్నా కాంప్లెక్స్‌లో అందరూ వంతు లేసుకుని మరీ వాళ్లని మనుషుల్లో పడేందుకు ప్రయత్నాలు చేశారు.

అయినా వసుంధర కుటుంబం తేరుకోలేకపోతోంది... ఏదో వెలితి గుండెల్లో గుబులు.

000

చాలా కాలం తర్వాత ఆ రోజు ఆఫీసు నుంచి ఇంటికొచ్చేసరికి నిశ్శబ్దనీరవవాతావరణాన్ని మార్చేసే దృశ్యం కనిపించింది వసుంధరకి. ఆమె మనసులో గూడుకట్టుకున్న ఆవేదన పటాపంచలై పోయింది.

వసుంధర అత్తగారు వంటింట్లో గరిటె తిప్పేస్తున్నారు. కరివేపాకు, పోపులో వేసి చేస్తున్న ఉప్పుడు పిండి వాసన బయటదాకా ఘుమఘుమ లాడిపోతోంది.

వంటింట్లోనే ఆవిడను దాదాపు కరుచుకుపోయాడు బబ్లూ.

తాతగారి ఒళ్లో చేరి చిలకలా కబుర్లాడుతోంది బబిత.

'ఆ...ఆ...బబితా! తాతగారి కాలు ఉండాలా? ఇంకా చిన్నపిల్ల ననుకుంటున్నావా? దిగి పక్కకి కూచో...'

'పోనీయమ్మా వసుంధరా! ఇంకా అది చిన్నప్పుడు నా ఒళ్లో ఆడుకుంటున్న మూడేళ్ల పిల్లలాగే వుంది. అలసిపోయినట్టున్నావు. పోయి కాఫీ తాగమ్మా! ఇదిగో ఏమేవ్ కోడలొచ్చింది.'

'ఎప్పుడొచ్చారు మావయ్యా! కనీసం ఉత్తరమైనా రాయలేదు. ఇల్లు ఎలా కనుక్కున్నారు? స్టేషన్ నుంచయినా ఫోన్ చెయ్యకపోయారా? అత్తయ్యా, ఎలా ఉన్నారు?'

రాజేశ్వరమ్మగారు కోడలికి కాఫీ అందించారు. 'ఇలా చిక్కిపోయా వేమిటే వసూ? ఏం ఉద్యోగాలో ఏమిటో? ఇల్లూ, పిల్లలూ ఆఫీసు



ఎలా నలిగిపోతున్నావో? బావిగాడు, బబ్బీ ఉప్పుడు పిండి కావాలంటే చేస్తున్నాను.'

'మమ్మీ! తాత వాళ్ల సర్‌ప్రయిజ్ విజిట్ ఎంత థ్రిల్లింగ్‌గా ఉందో కదూ!' బబిత తాతగారి ఒళ్లోంచి లేచి గంతు లేసింది. బబ్లూ మొహం మతాబాలా వెలిగిపోతోంది.

'ఏంటోనమ్మా! చదువులు, పరీక్షలు అంటూ రెండేళ్ల నుండీ పిల్లలు కనపడకపోయేసరికి గుండెల్లో గుబులు పుట్టేసింది మీ అత్తయ్యకీ నాకూ. ఇంక ఇదికాదు పనినుకుని మన రాజుగారబ్బాయి ఏదో పని మీద వస్తోంటే మా వాడి దగ్గర దిగబెడతావురా అబ్బీ అన్నాను. ఓ తప్పకుండా తాతగారూ అన్నాడు. నీ మరిది రిజర్వేషన్ చేయించేశా డు. పాపం ఆకుర్రాడు ఎంతో శ్రద్ధగా ఇంటి దగ్గర దిగబెట్టాడు కనక దిగులే లేదు.'

'తాతా! డాడీ వచ్చేటప్పటికి నువ్వు తలుపు వెనక దాక్కో. మామ్మని అన్నయ్య దాచేస్తాడు. డాడీ స్టన్నయిపోవాలి. భలేగా వుంటుంది.' బబిత గొంతులో ఉత్సాహం పరవళ్లు తొక్కుతోంది.

'అబ్బ... మీ ముద్దు మాటలు విని ఎన్నాళ్లయిందర్రా! ఏమిటోనే వసూ! ఒకటే పీడకలలు... రోజూ బస్సుల్లో వెళ్తూంటారు. పిల్లలెలా ఉన్నారోనని అల్లాడిపోయామనుకో. మీకెలాగూ కుదరటం లేదని మేమే వచ్చేశాం.'

'మంచి పని చేశారత్తయ్యా! జీవితంలో నిజంగా ఇంత ఆనందం ఎప్పుడూ లేదు.'

అమ్మా! మామ్మ నాకిష్టమని లడ్డూలు, కారప్పూస తెచ్చింది. ఎంత బాగున్నాయో! రేపు నా లంచ్ బాక్స్‌లో పెట్టు.. మా ఫ్రెండ్సందరికీ మామ్మ పిండివంటలు రుచి చూపిస్తాను.'

'నాకూ తెచ్చింది లేవోయ్ మినపసున్ని, పూతరేకులూ, పేలపు వడియాలు. నేనూ, నా క్లోజ్ ఫ్రెండ్ హసీనాకి రుచి చూపిస్తా.'

'నే చెప్పలేదే... పిల్లలు చూశావా ఎంత సంబరపడుతున్నారో. చేసేందుకు ఓపిక లేదనుకుంటాం గాని, మన వైపు పిండి వంటల రుచి బయట షాపుల్లో కొంటే ఏం తెలుస్తుంది? ఇలా చెప్పకుండా వస్తే దారిలో ఏదైనా జరగకూడనిది జరిగితే... అని అబ్బాయి ఏమంటాడోనని మీ అత్తయ్యకి దిగులమ్మా వసుంధరా!'

'ఏమనడాని కేముంటుంది? పెద్దవాళ్లు కదా! రైలెక్కేప్పుడో దిగేప్పుడో ఏ కాలైనా పట్టు తప్పితే ఇబ్బంది పడతారని గాని... అయినా మీ అబ్బాయి కూడా ఈ మధ్య చాలా సార్లు అనుకున్నారు



అమ్మానాన్నలని చూసి ఎన్నా ళ్లయిందోనని. పోనీండి. మన వాళ్లబ్బాయి కూడా వుండి దింపి వెళ్లాడంటున్నారుగా!'

'పొద్దుటే గౌతమికే వచ్చాం గాని ఆ కుర్రాడికి పెద్ద లగేజే ఉంది. అందుకని టాక్సీ మాట్లాడాడు. ముందు కుక్కట్‌పల్లికి వెళ్లి లగేజ్ వాళ్ల వాళ్ల కప్పజెప్పి, మళ్లీ మమ్మల్ని దింపేసి వెళ్లాడు పాపం! అదృష్టం కొద్దీ పిల్లలకీ సెలవే కనుక తాళం తీసే వుంది.'

'అవునే వసూ, మీ పుట్టింటి చాకలిలా వుంది. కుక్కట్‌పల్లిలో కనిపించింది... టాక్సీలో వాళ్ల సామాను దింపుతోంటేనూ. 'బాగున్నారామ్మా' అని పలకరించింది. అది ఇక్కడే ఉంటోందటగా. ఎంత లావైపోయిం దనుకున్నావూ! నేనైతే ముందు గుర్తుపట్టనే లేదు. అప్పుడు చంటి పిల్లల్నేసుకుని వచ్చేది నీ కోసం. వాళ్ల పెద్దాడట. గుర్రంలా ఎదిగిపోయాడనుకో.'

'అవునత్తయ్యా! ఇక్కడే ఇస్త్రీ బండి పెట్టుకుని బతుకుతున్నారు.' వసుంధర గుండెల నిండుగా గాలి పీల్చుకుంది. 'అత్తయ్యా చాలా రోజులుగా మనశ్శాంతి లేదనుకోండి. ఈ కాంప్లెక్స్‌లో అందరితో కలివిడిగా కళ్లముందే తిరిగే శ్వేత అనే పిల్లపోయేసరికి అందరికీ మతులు పోయాయనుకోండి.'

గుండె భారం దించుకోడానికి మనుషులు దొరికేసరికి, పిల్లలు వాళ్లిద్దరికీ వరసబెట్టి శ్వేత కబుర్లన్నీ అలా చెబుతునే ఉన్నారు. ఆ చెప్పడంలో వాళ్ల దిగులంతా తీరిపోయినట్టుంది. అసలు వాళ్ల చిన్ని గుండెల్లో అంత దిగులు గూడు కట్టుకుని వుందని గుర్తించనే లేదు.

రాఘవ అయితే పైకి తేలలేదు గాని, తల్లిదండ్రీ వచ్చాక ఎంతో రిలాక్స్ అయినట్టే కనిపించాడు.

000

ఓ నెల్లాళ్ల పాటు సందడే సందడి.

అప్పటివరకు ఎవరైనా ఇంటికి వచ్చినా, లేదా తాము ఏ ఫంక్షన్‌కైనా వెళ్లాల్సి వచ్చినా పిల్లలకు చదువుకునే టైము తగ్గిపోతుం దేమోనని ఆందోళనపడే వసుంధరకూ, రాఘవకూ ఎంతో ఊరటగా ఉంది.

కారణం పెద్దాళ్లొచ్చారని పిల్లలు చదువును ఏ మాత్రం అశ్రద్ధ చేయకపోవడమే కాదు, తాత-మామ్మలకి అర్థమైనా కాకపోయినా వాళ్లకి స్కూల్లో చెప్పే పాఠాలు. స్కూలు టీచర్ల విషయాలు, స్నేహితుల గురించి గంటలు గంటలు కబుర్లు చెప్తూనే హోం వర్కులు పూర్తి చేసుకునేవారు.

పిల్లల గదిలోంచి రోజు గలగలా కబుర్లు వినపడుతూండేవి. తాతా, బామ్మలతో బబ్లూ, బబిత ఫిర్యాదులు చేసుకోవడం. పెద్దవాళ్లిద్దరూ న్యాయమూర్తుల్లా తీర్పులు చెప్పడం.

పిల్లలు వేసిన బొమ్మల్ని రాసిన కవితలని, ఓపిగ్గా చూసి మెచ్చుకుంటూనే తప్పొప్పులు విప్పిచెప్పడం...

వాళ్లు నేర్చుకున్న పాటలూ, పద్యాలూ రోజూ వినిపించడం, పిల్లలు చూపించిన సర్టిఫికెట్లను అన్నింటినీ విడివిడిగా చూసి బహుమతుల వివరాలడగడం... వాళ్లూ ఈ నెల్లాళ్లూ చిన్నపిల్లలైపోయారు.

పెద్దవాళ్లిద్దరూ తమ చిన్ననాటి అనుభవాలను, అనుభూతులను. వంశవృక్షం గురించి చుట్టాలు, స్నేహితుల గురించి చిన్నప్పుడు పడ్డ కష్టాల గురించీ, పిల్లలకు వివరంగా చెప్పేవారు. అరమరికలు కల్లాకపటం లేకుండా. అందుకే వార్ధక్యంలో బాల్యానికి దగ్గర అంటారు. ఒకరికొకరు స్నేహితుల్లా కలిసిపోయారు తాతామనవలు. పెద్దవాళ్లుండగానే క్వార్టర్లీ పరీక్షలు జరిగాయి. రోజూ వాళ్ల తాత. మామ్మా నిద్ర లేపేవారు.

అంత వరకూ తెల్లారగట్ల ఎంతోసేపు విసిగిస్తే తప్ప లేవడానికి మారాం చేసేవాళ్లు కాస్తా, తాతగారి ఒక్క పిలుపుకే లేచి చక్కగా చదివేవారు. ఓ వంక కబుర్లు చెప్తూనే చదువుకుంటున్న పిల్లలను. వాళ్ల తాతగారు ఎంతో మెచ్చుకునేవారు. దాంతో మర్నాడు మరింత ఉత్సాహంగా లేచేవారు.

మార్కులు కూడా వాళ్లుండగానే ఇచ్చారు. చాలా బాగా వచ్చాయి. మార్కుల సంగతి అటుపెట్టి పిల్లలతో పాటు బాటు భార్యాభర్తలిద్దరూ కూడా ఎంతో తేరుకున్నారు.

ఏమైనా ఇంటికి పెద్దవాళ్ల అందమే అందం. వాళ్లకుండే సంయమనం, అనుభవం తమ కెక్కడవి? వాళ్లు పిల్లల్ని లాలించే తీరు. అనునయించే విధానం, తప్పు చేస్తే నచ్చజెప్పే విధానం ఎంత బాగున్నాయి! పిల్లలు లేవకపోయినా, మాట వినకపోయినా. విసుక్కోవడమో కోప్పడ్డమో తప్ప, తమకేం తెలుసు?

పరీక్షలైపోయాక ఓ రోజు బిర్లా టెంపుల్, ఓ రోజు గోల్కొండ ఖిల్లా. ఓ రోజు యాదగిరిగుట్ట, ఓ సారి శ్రీశైలం, మంత్రాలయం ఇలా తిరిగేసరికి పిల్లలతో పాటు పెద్దవాళ్లిద్దరికీ కూడా ఎంతో సంతోషం...

ఇరవై నాలుగ్గంటలూ పిల్లల గురించి ఆలోచించనవసరం లేకుండా వసుంధర, రాఘవలిద్దరికీ ఒక చెప్పలేని విశ్రాంతిగా అనిపించింది.

ఒక సారి పిల్లల మాటలు వింటూంటే తాతామనవలు ఎంత ●